





కలెక్టర్ బౌలింగ్.. ఎస్పీ బ్యాటింగ్!

కలెక్టర్ షన్మోహన్ బౌలింగ్ చేశారు. ఎస్పీ రిషాంత్‌రెడ్డి బ్యాట్‌తో బాల్స్ ధాటీగా ఎదుర్కొన్నారు. చిత్తూరులో శనివారం కొత్త పోలీస్ గ్రౌండ్‌లో కలెక్టర్, ఎస్పీ జట్ల మధ్య జరిగిన క్రికెట్ పోటీలో ఈ ఇద్దరు జిల్లా అధికారుల క్రీడోత్సాహాన్ని అందరూ ఆహ్లాదంగా వీక్షించారు. పోటీలో కలెక్టర్ జట్టు మీద ఎస్పీ జట్టు విజయం సాధించింది. జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ సమీపంలో నూతనంగా నిర్మించిన పోలీసు గ్రౌండ్‌ను ఎస్పీతో కలిసి కలెక్టర్ ప్రారంభించిన సందర్భంగా ఈ పోటీ జరిగింది. క్రీడా మైదానం నిర్మాణానికి కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

- చిత్తూరు

ఎస్ఈబీ సీఐల బదిలీ


చిత్తూరు సిటీ, జనవరి 20: ఎన్నికలు సమీపిస్తుండటంతో వివిధ శాఖల్లో అధికారుల బదిలీలు జోరందుకున్నాయి. శనివారం ఎక్సైజ్ శాఖకు సంబంధించి వివిధ స్టేషన్లలో పనిచేస్తున్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సీఐలను ప్రభుత్వం బదిలీ చేసింది. చిత్తూరు అర్బన్ సీఐ జోగేంద్ర.. నంద్యాల జిల్లా బనగానపల్లెకు, చిత్తూరు రూరల్ సీఐ చంద్రశేఖర్.. కర్నూలు జిల్లా క్షేత్రగుడికి, రామసముద్రం సీఐ శ్వేతారెడ్డి.. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెకు, కార్వేటినగరం నాగరాజు.. కడప జిల్లా సిద్దవటంకు, నగరి సీఐ వర్దనాదేవి.. నంద్యాల జిల్లా కోయిలకుంట్లకు, పలమనేరు సీఐ ఎల్లయ్య.. అనంతపురానికి, కుప్పం సీఐ కిషోర్ కుమార్.. అనంతపురం జిల్లా ఉరవకొండకు, పుంగనూరు సీఐ శ్వేతారామి రెడ్డి.. నంద్యాల జిల్లా నందికొట్కూరుకు, వి.కోట సీఐ కన్నయ్య.. పుట్టపర్తికి, నరహరిపేట చెక్‌పోస్టు సీఐ రఫీ.. కర్నూలు ఇంటెలిజెన్స్‌కు, పలమనేరు క్యాటిల్ ఫామ్ చెక్‌పోస్ట్ సీఐ మహ్మద్ రఫీ.. కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు.

మరో దళిత నిరసన స్వరం

- నారాయణస్వామి కావాలి.. రెడ్డెప్ప వద్దంటూ నినాదాలు
- మూకుమ్మడిగా రాజీనామా చేస్తామంటూ హెచ్చరికలు

జిల్లాలో మరో దళిత నేత నిరసన స్వరం మొదలైంది. జీడీనెల్లూరు టికెట్ ఇవ్వకపోవడంతో డిప్యూటీ సీఎం నారాయణస్వామి తాను నోరు తెరవకుండానే, తన అనుచరుల ద్వారా అసమ్మతిని ప్రకటిస్తున్నారు. శుక్ర, శనివారాల్లో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు ప్రెస్‌మీట్లు నిర్వహించారు. జీడీనెల్లూరుకు నారాయణస్వామి కావాలి.. రెడ్డెప్ప వద్దు.. అంటూ ప్రకటించారు. ఒకవేళ నారాయణస్వామికి టికెట్ ఇవ్వకుంటే అన్ని పదవులకు రాజీనామా చేస్తామంటూ అల్టిమేటం జారీ చేశారు. వైసీపీ అధిష్ఠానం ఇప్పటికే దళితులు ప్రాతినిథ్యం వహిస్తున్న తిరుపతి, చిత్తూరు ఎంపీ అభ్యర్థులను.. పూతలపట్టు, జీడీనెల్లూరు, సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చడంతో ఆ సామాజికవర్గంలో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



జీడీనెల్లూరు నుంచే మళ్లీ తనకో తన కూతురికో అవకాశం లభిస్తుందని బలంగా నమ్మిన నారాయణస్వామికి చేదు అనుభవం ఎదురైంది. ఎంపీగా పోటీ చేయడానికి ఏ మాత్రం ఆయన సుముఖంగా లేరు. అయినా ఆశ చావక, సీఎం జగన్‌ను కలిసేందుకు శనివారం నుంచి విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. దీనికి సమాంతరంగా ఆయన అనుచరవర్గం నిరసన స్వరం పెంచింది. శుక్రవారం కార్వేటినగరం, జీడీనెల్లూరు మండలాల వైసీపీ నాయకులు స్థానికంగా ప్రెస్‌మీట్లు నిర్వహించి నారాయణస్వామికే టికెట్ ఇవ్వాలంటూ తీర్మానించారు. శనివారం పెనుమూరు, ఎస్ఆర్ పురం మండలాల నాయకులు చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో, వెదురుకుప్పం మండల నాయకులు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నారాయణస్వామికి మద్దతుగా ప్రెస్‌మీట్ పెట్టారు. నారాయణస్వామికి టికెట్ ఇవ్వకుంటే పదవులకు రాజీనామా చేస్తామంటూ అల్టిమేటం జారీ చేశారు. జ్ఞానేంద్రరెడ్డి వర్గానికి ఓటు బ్యాంకు లేదని ఆరోపించారు. నారాయణస్వామికి పెనుమూరు జ్ఞానేంద్రరెడ్డితోపాటు నియోజకవర్గంలోని రెడ్డి సామాజికవర్గం వ్యతిరేకంగా ఉన్నా, మిగిలినవర్గాలు ఆయనతోనే ఉన్నాయి. ఇప్పుడు పెద్దిరెడ్డికి నమ్మకస్తుడైన ఎంపీ రెడ్డెప్ప తెరమీదికి రావడంతో నారాయణస్వామికి టికెట్ రాకపోవడం వెనుక పెద్దిరెడ్డి ఉన్నాడనే అంశం ప్రచారం అవుతోంది. నారాయణస్వామితో ఉన్న వర్గాలన్నీ రెడ్డెప్ప అభ్యర్థి అయితే పనిచేయబోమని బహిరంగంగా చెప్తున్నాయి. రెడ్డెప్ప నాన్‌లోకల్ అనే మాట కూడా వైరల్ అవుతోంది.

రెడ్ల మాటే ఫైనల్

పెనుమూరు మండలానికి చెందిన జ్ఞానేంద్ర రెడ్డి వర్గం ఆది నుంచీ నారాయణస్వామిని వ్యతిరేకిస్తోంది. వీరికి మంత్రి పెద్దిరెడ్డి అండ ఉండడంతో పదవులు దక్కాయి. పనులూ అయ్యాయి. అనేకమార్లు నారాయణస్వామికి టికెట్ ఇస్తే ఓడిస్తామంటూ వ్యతిరేకవర్గం ప్రకటించింది. అయినా నారాయణస్వామికి సీఎం జగన్‌తో ఉన్న సాన్నిహిత్యం దృష్ట్యా టికెట్ ఆయనకే వస్తుందనుకున్నారు. ఊహించని విధంగా ఆయన్ను మార్చేసి, నియోజకవర్గంతో ఏమాత్రం సంబంధం లేని రెడ్డెప్పకు టికెట్ ఇచ్చారు. నారాయణస్వామికి టికెట్ రాకుండా చేయడంలో పెద్దిరెడ్డి ప్రమేయం ఉందని ఆయన అనుచరులు ఆగ్రహిస్తున్నారు. డిప్యూటీ సీఎం అయినా కూడా రెడ్డి సామాజికవర్గం నిర్ణయమే ఫైనల్ అని వైసీపీలో రుజువైందని అంటున్నారు.

పెద్దిరెడ్డికి పంటికింద రాయి

జిల్లాలో పెద్దిరెడ్డి తర్వాత నేరుగా సీఎం జగన్‌ను కలిసి చనువుగా పనులు చేయించుకోగల వ్యక్తి నారాయణస్వామి అని పేరుంది. పెద్దిరెడ్డితోపాటు తొలి విడతలో మంత్రి పదవి దక్కించుకున్నారు. రెండో విడతలో పెద్దిరెడ్డికి మాత్రమే మంత్రి పదవి వస్తుందని, నారాయణస్వామికి ఇవ్వడం లేదని పెద్దఎత్తున ప్రచారం జరిగింది. చివరి నిమిషంలో మళ్లీ పెద్దిరెడ్డితోపాటు మంత్రి పదవి కొనసాగింది. అవకాశం వచ్చినప్పుడల్లా తనను వ్యతిరేకించే రెడ్డి సామాజికవర్గం మీద విమర్శలు చేసేవారు. తన నియోజకవర్గానికి కలెక్టర్, జేసీ వంటి జిల్లా అధికారులను పిలుచుకు వచ్చి సమావేశాలు, పర్యటనలు చేయించేవారు. తాను సిఫారసు చేసిన పని ఏదైనా అధికారులు నిర్లక్ష్యం చేస్తే 'రెడ్లు చెప్తేనే చేస్తారా.. దళితులు చెప్పే పనులకు విలువ ఇవ్వరా' అంటూ ప్రశ్నించి పనులు చేసుకునేవారు. ఈయన డిప్యూటీ సీఎం కావడంతో జిల్లా స్థాయిలో జరిగే ప్రతి సమావేశంలోనూ తప్పక ప్రాధాన్యం ఇవ్వాల్సి వచ్చేది. పెద్దిరెడ్డి జిల్లా అంతా శాసించినా, నారాయణస్వామి మాత్రం ఈ ఐదేళ్లు ఆయనకు పంటికింద రాయిలా మారారని చెప్పవచ్చు. అందుకే పెద్దిరెడ్డి జీడీనెల్లూరులో నారాయణస్వామి వ్యతిరేక వర్గాన్ని ప్రోత్సహించినట్లు చెబుతారు.

'గడప గడప'లో అవమానం జరిగినా..

జిల్లాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నారాయణస్వామి మిగిలిన ఎమ్మెల్యేల కంటే ఎక్కువగా చేశారు. అయినా అడుగడుగునా నిలదీతలు, అవమానాలు ఎదురయ్యాయి. జీడీనెల్లూరు మండలం పాచిగుంట గ్రామంలో ఈయన వస్తున్నారని ప్రజలు ఇళ్లకు తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. పూతలపట్టు మండలంలోని ఓ గ్రామంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పర్యటించి వెళ్లిపోయాక అక్కడివారు పసుపు నీళ్లు చల్లారు. దళిత ఎమ్మెల్యేలకు అవమానం జరిగినా మిగిలిన వైసీపీ ఎమ్మెల్యేలు స్పందించలేదని నారాయణస్వామి ఓ సందర్భంలో ఆవేదన చెందారు. ఇలా జిల్లాలో దళిత ఎమ్మెల్యేల పట్ల తొలి నుంచీ సొంత పార్టీ నాయకులే చిన్నచూపు ప్రదర్శిస్తున్నారు. తాజాగా టికెట్ విషయంలోనూ ఆ చిన్నచూపు కొనసాగింది.

నా భర్తను పోలీసులే చంపేశారు!



కుమార్ మృతదేహం



విజయపురం పోలీసు స్టేషన్ ఎదుట కుటుంబీకులతో బైఠాయించిన భారతి

- న్యాయం చేయాలంటూ విజయపురం పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితురాలి ధర్నా

విజయపురం, జనవరి 20: 'నా భర్తను పోలీసులే చంపేశారు. న్యాయం చేయండి' అంటూ ఓ వివాహిత తన కుటుంబీకులతో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగింది. ఈ సంఘటన విజయపురం పోలీస్ స్టేషన్ వద్ద శనివారం జరిగింది. బాధితురాలు భారతి మాటల్లోనే.. 'మాది విజయపురం మండలంలోని కేవీపురం దళితవాడ. శుక్రవారం రాత్రి 9.30 గంటలకు నా తమ్ముడు చంద్రశేఖర్‌తో కలిసి నా భర్త కుమార్ (46) బహిర్భూమికని వెళ్లారు. కొంతసేపటికి వారిద్దరినీ విజయపురం పోలీసులు విచారిస్తున్నట్టు గ్రామంలో ఓ వ్యక్తి చెప్పడంతో అక్కడికెళ్లి చూడగా వారి ఆచూకీ తెలియలేదు. దాంతో రాత్రి 10.30 గంటల వరకు కుటుంబీకులతో కలిసి గాలించినా ఫలితం లేకపోయింది. శనివారం ఉదయం 11 గంటలకు ఓ గుంటలో నా భర్త శవమై కనిపించాడు. విచారించడానికి తీసుకెళ్లి నా భర్తను పోలీసులే చంపేశారు. వారిపై చర్యలు తీసుకోవాలి' అని భారతి కన్నీరు మున్నీరుగా విలపించారు. న్యాయం చేయాలంటూ పోలీసు స్టేషన్ ఎదుట బంధువులతో కలిసి ధర్నా చేశారు. పోలీసుస్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో ఏఎస్పీ శ్రీలక్ష్మి, డీఎస్పీ రవికుమార్, సీఐలు శ్రీనివాసంతి, సురేశ్, సత్తిబాబు, ఎస్ఐలు శివశంకర్, దస్తగిరి, రమేశ్, రాజపుల్లయప్పలు సిబ్బందితో బాధితుల వద్దకొచ్చారు. కేసును సమగ్రంగా విచారించి, న్యాయం చేస్తామని సర్దుబాటు చేశారు.

మృతితో మాకు సంబంధం లేదు: పోలీసులు

కేవీపురం దళితవాడలో సారా తయారీపై ఫిర్యాదు రావడంతో విజయపురం నుంచి ఇద్దరు పోలీసులు శుక్రవారం రాత్రి ఆ స్థావరంపై దాడి చేశారు. సారా కాస్తున్న ఇద్దరిలో చంద్రశేఖర్ పట్టుబడగా, కుమార్ పరారయ్యాడు. చంద్రశేఖర్‌ని మాత్రం పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చాం' అని పోలీసులు తెలిపారు. ఇక శనివారం ఉదయం కుమార్ కుటుంబీకుల ఫిర్యాదుతో సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తుల సమక్షంలో పరిశీలించగా చెరువులోని బురదలో చిక్కుకుని మృతి చెంది ఉన్నాడని గుర్తించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. కుమార్‌పై గతంలో కూడా నాలుగు కేసులు ఉన్నాయని, అతడి మృతితో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న అమరనాథరెడ్డి

వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఎర్రచందనం, ఇసుక స్మగ్లర్లు

- మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఆరోపణ

చిత్తూరు సిటీ, జనవరి 20: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఎర్రచందనం, ఇసుక స్మగ్లర్లే ఉన్నారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఆరోపించారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని వాపోయారు. స్థానిక సంస్థలు, ఉప ఎన్నికల్లోనూ అధికార పార్టీ అనేక అక్రమాలకు పాల్పడిందని చెప్పారు. దొంగ ఓట్లు వేయడం, తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి అక్రమ మార్గంలో పదవులు సంపాదించుకున్నారని విమర్శించారు. తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో దొంగ ఓటర్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టించినా అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఇప్పుడు చొరవ తీసుకుని.. వైసీపీకి అనుకూలంగా పనిచేసిన కొందరు అధికారులను సస్పెండ్ చేయడం హర్షనీయమన్నారు. దీనిప్రకారం చూస్తే వైసీపీ ప్రజా ప్రతినిధుల ఎన్నిక అప్రజాస్వామికమని, వారిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. శేషాచలం అడవుల్లోని ఎర్రచందనాన్ని వైసీపీ నేతలు లూటీ చేస్తున్నారని అన్నారు. నాలుగున్నరేళ్లలో ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ఎన్ని కేసులు పెట్టారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే అడవుల్లో ఉన్న పులులు, ఏనుగులు జనావాసాల్లోకి వస్తున్నాయంటే కారణమేమిటో చెప్పాలన్నారు. ఇవన్నీ ప్రజలు గమనించి సరైన నిర్ణయం తీసుకుని.. ఓట్లు వేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ.. చిత్తూరు నియోజకవర్గంలో సుమారు 13,600 ఓట్లు చేర్చారని, 15వేలకుపైగా ఓట్లు తీసివేశారని, షిఫ్టింగ్ ఓట్లు 15వేల వరకు ఉన్నాయని చెప్పారు. 22వ తేదీన ఓటర్ల జాబితా వస్తుందని.. దాని ఆధారంగా దొంగ ఓట్లను గుర్తించి కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని అన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఓ ఎర్రచందనం స్మగ్లర్‌కు వైసీపీ టికెట్ ఇచ్చిందని చెప్పారు. ఎర్రచందనం స్మగ్లర్లకంతా కింగ్ పిన్ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి అని ఆరోపించారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత సీఎం జగన్‌కు లేదు

పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీ మోహన్ మాట్లాడుతూ.. వైసీపీ అరాచకాలకు దళితులు బలవుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 7,500 మంది పైన దాడులు, 500 మంది మహిళలపై అత్యాచారాలు జరగ్గా, 188 మందికిపైగా హత్యకు గురయ్యారని చెప్పారు. అయినా ఏ ఒక్క బాధిత దళితుడినైనా సీఎం జగన్ పరామర్శించారా అని ప్రశ్నించారు. అటువంటి సీఎంకు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదన్నారు. సమావేశంలో నేతలు సురేంద్రకుమార్, చంద్రప్రకాష్, కటారి హేమలత, కాజూరు బాలాజి, సీఆర్ రాజన్, గురజాల చెన్నకేశవులు నాయుడు, బద్రినారాయణ, కోదండయాదవ్, మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న క్రికెట్ టీమ్'లో 9 మందే ఆటగాళ్లు!

- 'ఆడుదాం ఆంధ్ర'లో ఇదీ పరిస్థితి



టీ షర్టులు లేకుండా క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

పెనుమూరు, జనవరి 20: క్రికెట్ మ్యాచ్ ఆడాలంటే ఓ జట్టులో 11 మంది సభ్యులుంటారు. కానీ జగనన్న ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పోటీల్లో మాత్రం ఓ జట్టును తొమ్మిది మందితోనే ఆడించారు. పెనుమూరు మండలంలోని శాతంబాకం పంచాయతీలోని పెద్దరాజుపల్లెలోని క్రీడామైదానంలో మండల స్థాయి క్రికెట్ ఫైనల్స్ శనివారం నిర్వహించారు. ఇందులో రామకృష్ణాపురం జట్టుతో కలవగుంట టీమ్ ఆడాల్సి ఉంది. అయితే రామకృష్ణాపురం జట్టులో ఇద్దరు క్రీడాకారులు తక్కువ ఉన్నారు. దాంతో రిజిస్ట్రేషన్ చేసుకున్న మరో ఇద్దరిని కలుపుకుని ఆడతామని ఆ జట్టు కోరింది. అందుకు నిర్వాహకులు మాత్రం గతంలో ఆడిన జట్టు సభ్యులే ఉండాలని చెప్పారు. దాంతో చేసేదేమీలేక రామకృష్ణాపురం జట్టు తరఫున తొమ్మిది మంది మాత్రమే బరిలోకి దిగారు. వారితోనే ఆడించేయగా, ఈ జట్టే విజయం సాధించింది. ఇదిలా ఉంటే.. ఆడుదాం ఆంధ్రలో భాగంగా ప్రతి సచివాలయానికి 110 టీషర్టులు పంపిణీ చేశారు. అయితే ప్రస్తుతం క్రికెట్ ఆడిన వారిలో 10శాతం మంది కూడా టీషర్టులు వేసుకోకపోవడం గమనార్హం.

కులగణనకు యాప్‌తో ఆపసోపాలు

- మొరాయిస్తున్న సర్వర్
- మాకొద్దీ సర్వే అంటున్న కుటుంబ యజమానులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 20: కులగణనకు తొలి రెండ్రోజులు సిబ్బందికి అడ్డంకులు ఎదురయ్యాయి. రోజంతా మొబైల్ యాప్‌లు పనిచేయక పోవడంతో రాత్రి వరకు ఆపసోపాలు పడుతూ గణన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు సర్వర్ మొరాయించడంతో మరిన్ని ఇక్కట్లు తప్పడం లేదు. ఒక్కో ఇంటి వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో ఆయా కుటుంబ యజమానుల సహనాన్ని పరీక్షించినట్లయ్యింది. ఈ సర్వే కోసం ప్రతి సచివాలయంలోనూ సిబ్బంది, వలంటీర్లు, నోడల్ ఆఫీసర్లతో స్పెషల్ టీమ్‌లను నియమించారు. వలంటీర్లు రెండ్రోజులుగా యాప్ ద్వారా అనుసంధానం కాగానే మొత్తం 14 అంశాలను పూర్తిచేయాల్సి ఉంది. జిల్లాలో 4,502 మంది సిబ్బంది.. 504 గ్రామ, 108 వార్డు సచివాలయాల పరిధిలో శుక్రవారం నుంచి గణన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. సర్వే మధ్యలోనే పలు కుటుంబ యజమానులు మా కొద్దీ సర్వే అంటూ వెళ్లిపోతున్నారు. కులగణన ఈనెల 28వ తేదీ వరకు నిర్వహిస్తారు.

సర్వే ఇలా..

ప్రతి కుటుంబంలో ఎంత మంది ఉన్నారు.. ఏ కులం, ఉప కులం, మతం, చదువు, వివాహ స్థితి, కుటుంబ సభ్యులందరి వ్యక్తిగత వివరాలు సేకరించాలి. ఇదంతా అయ్యాక ఆ కుటుంబ సభ్యుడి వద్ద బయోమెట్రిక్ అథెంటికేషన్ చేయించుకోవాలి. అనంతరం సచివాలయ సెక్రటరీ, వలంటీరు బయోమెట్రిక్ వేయాలి. ఇదిలా ఉండగా వలంటీర్లకు కావాల్సిన బయోమెట్రిక్ పరికరాలు 50శాతం మందికి లేదు. ఉన్నవాటిలో 20 శాతంపనిచేయడం లేదు. మరోపక్క వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సమన్వయం ఉండటం లేదని తెలుస్తోంది.

"తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో జరిగిన తప్పిదాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటాం సరే... చేయించిన వారి సంగతేమిటి? ఎపిక్ కార్డులనేవి ఎన్నికల సంఘం ఆస్తి. మా ఆస్తిని కాజేయాలని చూస్తారా? ఇక్కడ ప్రజాస్వామ్యం వున్నట్టా? లేనట్టా? అధికారులు, ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి ఓటరు ఐడీ కార్డులు డౌన్‌లోడ్ చేయించిన వారెవరో తేల్చాలి...వారికి శిక్ష పడేలా చూడాలి..." ఇదీ కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారికి జారీచేసిన ఆదేశం. దీంతో ఓటరు ఐడీ కార్డుల డౌన్‌లోడ్, నకిలీ కార్డుల తయారీ వ్యవహారంలో సూత్రధారులెవర్నది తేల్చడానికి పోలీసు శాఖ ఆధ్వర్యంలో మూడు టెక్నికల్ టీములు ఏర్పాటయ్యాయి.మరోవైపు వివిధ రాజకీయ పక్షాల నాయకులు దొంగ ఓటర్ల వ్యవహారంపై ఇచ్చిన ఫిర్యాదుల పురోగతి, స్టేటస్ ఏమిటన్నది తేల్చడానికి విడిగా మరికొందరు అధికారులతో బృందాలు నియమితమయ్యాయి. దీంతో అధికారులను ముందు పెట్టి తెరవెనుక నుంచీ తతంగం నడిపించిన సూత్రధారులెవరన్నది త్వరలోనే వెలుగులోకి రానుంది.

సాంకేతిక అంశాల దర్యాప్తునకు టెక్నికల్ టీముల ఏర్పాటు

పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుల స్టేటస్ కోసం విడిగా బృందాలు

సూత్రధారుల సంగతేంటి?



తిరుపతిలో దొంగ ఓటర్ల వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ఎన్నికల కమిషన్

చేసిన అధికారులపై చర్యలు సరే... చేయించిన వారి సంగతేమిటని ప్రశ్న

తిరుపతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలే లక్ష్యంగా తయారు చేయించిన దొంగ ఓటర్ల వ్యవహారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణిస్తోంది.ఈ వ్యవహారంలో తిరుపతి సెగ్మెంట్‌కు అప్పట్లో ఈఆర్వోగా పనిచేసిన నాటి తిరుపతి మున్సిపల్ కమిషనర్, ఇటీవలి వరకూ అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన గిరీషాను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అలాగే అప్పటి తిరుపతి సెగ్మెంట్ ఏఈఆర్వోగా పనిచేసిన తిరుపతి అర్బన్ తహసిల్దారు జయరాములు, ఎలక్షన్ డీటీగా పనిచేసిన విజయ్‌భాస్కర్ కూడా సస్పెండయ్యారు. రికార్డుల ఆధారంగా ఈ వ్యవహారానికి బాధ్యులైన అధికారులందరిపై ఈసీ చర్యలకు ఉపక్రమిస్తున్న సంగతి తెలిసిందే. దీనికి సమాంతరంగా మరో ప్రక్రియ మొదలైనట్టు తెలిసింది. పాత్రధారులైన అధికారులపై చర్యలు తీసుకుంటున్నామని, అయితే అధికారులతో ఈ తతంగం నడిపించిన సూత్రధారులెవరో తేల్చాలని ఈసీ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారిని ఆదేశించినట్టు తెలిసింది. సంబంధిత అంశంపై విచారణ త్వరగా ముగించి నివేదిక ఇవ్వాలని షరతు విధించినట్టు తెలిసింది. ఒకవేళ చేయలేని పరిస్థితి వుంటే తాము ఇతర ఏజెన్సీల ద్వారా సొంతంగా చేయించుకుంటామని కూడా స్పష్టం చేసినట్టు తెలిసింది. దీంతో సాంకేతిక అంశాలను తెలుసుకునేందుకు డీఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో మూడు టెక్నికల్ బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ఆ బృందాలు ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించాయని కూడా సమాచారం.ఈ బృందాలు ఎక్కడెక్కడ, ఏ కంప్యూటర్ సిస్టమ్స్ ద్వారా ఓటరు ఐడీ కార్డులు డౌన్‌లోడ్ చేశారు? ఎవరెవరి లాగిన్లలో చేశారు? ఎన్ని సెషన్లలో ఎన్నెన్ని కార్డులు డౌన్‌లోడ్ చేశారు?ఆయా కంప్యూటర్లు ఎవరు వినియోగించారు? వాటి ఐపీ అడ్రసులు ఏవి? వినియోగించిన నెట్ కనెక్షన్ ఎవరిది? మొబైల్ ద్వారా నెట్ వినియోగించి వుంటే ఆ మొబైల్ ఫోన్లు ఎవరివి?... ఇలా సాంకేతిక అంశాలను నిగ్గు తేల్చేందుకు యత్నిస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ మున్సిపల్, రెవిన్యూ కార్యాలయాల్లో కాకుండా ప్రైవేటు కార్యాలయాలు, ఇళ్ళలో గనుక ఈ తతంగం నడిచివుంటే, ప్రైవేటు కంప్యూటర్లు, ప్రైవేటు ఇంటర్‌నెట్ కనెక్షన్లు వినియోగించి వుంటే ప్రైవేటు వ్యక్తుల గుట్టు రట్టవుతుంది. వారి ద్వారా తెరవెనుక కుట్రదారులెవరన్నది తేలనుంది.

ఫిర్యాదుల పురోగతిని తేల్చే పనిలో మరిన్ని బృందాలు

మరోవైపు ఇతర జిల్లాలకు చెందిన డీఎస్పీ స్థాయి అధికారులకు ఇతర బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. తిరుపతి సెగ్మెంట్‌లో దొంగ ఓటర్లకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల నాయకుల నుంచీ, వ్యక్తుల నుంచీ అందిన ఫిర్యాదులు ఏమయ్యాయనే కోణంలో ఈ విచారణ సాగనుంది. పోలీసు స్టేషన్లలో ఇచ్చిన ఫిర్యాదులు నమోదయ్యాయా? కాలేదా? నమోదై వుంటే దర్యాప్తు చేశారా? నిందితులను అరెస్టు చేశారా? ఛార్జిషీట్లు వేశారా? కోర్టులో ప్రస్తుతం ఆ కేసులు ఏ దశలో వున్నాయి? వంటి అంశాలను పరిశీలించి కేసుల స్థితిని ఈ బృందాలు నివేదించాల్సి వుందని సమాచారం. దీనికోసం పొరుగు జిల్లా నుంచీ ఇద్దరు డీఎస్పీలు ఇప్పటికే పలు మార్లు తిరుపతి వచ్చి వివరాలు సేకరించినట్టు తెలిసింది.

కీలకం కానున్న ఆ ఎమ్మెల్యే ఆడియో క్లిప్

తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో దొంగ ఓట్లకు సంబంధించి అప్పట్లో ఓ వైసీపీ ఎమ్మెల్యే చేసిన ఫోన్ సంభాషణ తాలూకా ఆడియో క్లిప్పింగ్ కీలకం కానుంది. ఎక్కడి నుంచో ఓ వ్యక్తి సదరు ఎమ్మెల్యేకి పోలింగ్ ముందురోజు ఫోన్ చేసి 450 మంది ఓట్లు వేయడానికి సిద్ధంగా వున్నారని, వారిని తీసుకురమ్మంటారా అని అడగడంతో వారి మధ్య జరిగిన సంభాషణ ఆడియో క్లిప్ అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అయింది. ఆ సంభాషణ యధాతథంగా....

సార్... రామ్ మాట్లాడతారు అన్న మాటతో సంభాషణ ప్రారంభమైంది.

ఎమ్మెల్యే : ఇప్పుడూ ఇంత రేత్రిలో కష్టమూ... వచ్చినా టైమ్ సరిపోదని మనోళ్ళ ఫీలింగ్
రామ్: అవునా సర్
ఎమ్మెల్యే: ఓటింగ్ టైమ్ సరిపోదు
రామ్: అంటే మనకు నైన్ అవర్సే కదా సర్ జర్నీ
ఎమ్మెల్యే : లేదు హడావిడైపోతుంది. 450 మందిని.. ఏడు బస్సులు కాదు పన్నెండు బస్సులు కావాలి.
రామ్: లేదు సర్ ఫిఫ్టీ మెంబర్స్ కెపాసిటీ కదా సర్.
ఎమ్మెల్యే: అవునయ్యా తొమ్మిది బస్సులు కావాలి. తొమ్మిది బస్సుల్లో వచ్చి మధ్యలో ఆపుతారు.చాలా ఇష్యూస్ వుంటాయి ఇక్కడ. దారిపొడుగూకా ఆపుతారు.
రామ్: అంటే మన టీమ్ వస్తున్నారు కద సార్. ఎంప్లాయిస్ వీళ్ళు కో ఆర్డినేట్ చేసుకుంటారు
ఎమ్మెల్యే: అది ముందు చూసుకోవల్ల... రెండు రోజుల ముందనుకోని వుంటే ప్లాన్ చేసుకోని వుండచ్చు
రామ్: ఆల్‌రెడీ మేమెప్పుడో చెప్పాము సార్ ఇది
ఎమ్మెల్యే: నాతో డిస్కస్ చేయలేదు ఎవరూ
రామ్: మేము సార్ గారికి చెప్పాము... మీకు పంపించమని చెప్పేసరికి మేము
ఎమ్మెల్యే: ఇప్పుడు అందరినీ నిద్ర లేపి... నాలుగు గంటలకు బయల్దేరిపిచ్చి
రామ్: లేదు సర్ ఆల్రెడీ అందరికీ మేము
ఎమ్మెల్యే: ఈ 400 ఓట్లు ఇక్కడేసుకుంటాములే... ఏదో రకంగా మేనేజ్ చేసుకుని... వాళ్ళ ఓట్లు మనం ఎవరో ఒకరితో వేయించుకునేస్తే సరిపోతుంది... ఎందుకు పాపం వాళ్ళకు శ్రమ... మళ్ళా వచ్చి వెళ్లిపోవల్ల కదా... అంత శ్రమవద్దులే. 400 ఓట్లు ఈడ వేసేసుకోవచ్చులే...
రామ్: సరే సర్

ఈ ఆడియో క్లిప్ అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొట్టింది. ప్రత్యేకించి తిరుపతి ప్రాంతంలో బాగా సర్క్యులేట్ అయింది. దీంట్లో సంభాషణ వింటే బహుశా హైదరాబాదులో ఏదైనా కంపెనీ లేదా ఫ్యాక్టరీ వంటిచోట పనిచేస్తున్న తిరుపతి ప్రాంతానికి చెందిన 450మందిని తిరుపతికి తరలించి వారితో ఓట్లు వేయించేందుకు ఏర్పాట్లు చేసినట్టుగా వుంది. అది కూడా పోలింగ్ ముందురోజు రాత్రి ఫోన్ సంభాషణ జరిగినట్టు వుంది. పోలింగ్ రోజు తెల్లవారుజామున 4 గంటలకు బయల్దేరి 9 గంటల్లో తిరుపతి చేరుకోవడం అంటే ఖచ్చితంగా హైదరాబాదు నుంచీ తరలించే ప్రయత్నమేనని భావించాల్సి వచ్చింది. ప్రయాణ వ్యవధి 9గంటలే అయినా మధ్య మధ్యలో పోలీసు, రవాణా శాఖల అధికారులు ఆపి తనిఖీ చేయడం, ఇతర అవసరాలకు వాహనాలు ఆపితే తిరుపతి చేరుకునే సరికి పోలింగ్ సమయం ముగిసిపోయే అవకాశమున్నందునే ఆ ప్రయత్నం విరమించుకుని వారి ఓట్లను ఇక్కడే ఎవరితోనైనా వేయించేయాలన్న నిర్ణయానికి వచ్చారని అనిపించింది. ఆడియో క్లిప్పింగ్ విన్న స్థానిక టీడీపీ నేతలు దీన్ని జత చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. కాగా టీడీపీ అధినేత చంద్రబాబు సైతం దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. పోలింగ్ ముగిసిన రెండో రోజు ఈ ఆడియో టేపు వెలుగు చూసింది. ఇపుడు దొంగ ఓటర్ల వ్యవహారంపై ఈసీ విచారణకు, చర్యలకు ఉపక్రమించిన నేపథ్యంలో ఈ ఆడియో టేపు కూడా కీలక ఆధారంగా మారే అవకాశముంది.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

చిత్తూరు (సెంట్రల్), జనవరి 20: నవోదయ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి శనివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో విజయేంద్రరావు, నవోదయ ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 26 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 4789 మంది విద్యార్థులకుగాను 3919 మంది హాజరవగా, 870 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. డీఈవో ఐదు కేంద్రాలు, తాను ఐదు కేంద్రాలు పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ వివరించారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లకు గడువు పొడిగింపు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 20: ఓపెన్ స్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు డీఈవో విజయేంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలకు గడువు సోమవారానికి ముగుస్తున్న క్రమంలో ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. మీ-సేవ, ఏపీ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

చిత్తూరు సిటీ, జనవరి 20: రోడ్డు భద్రతా మాసోత్సవాల వాల్‌పోస్టర్లు, కరపత్రాలను జిల్లా పోలీసు గ్రౌండ్‌లో కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ రిషాంత్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏటా రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డీటీసీ నిరంజన్ రెడ్డి, ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు వాసుదేవరెడ్డి, మురళి, దీపిక, ఏఎంవీఐ ప్రసాద్ వర్మ, ఎస్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా రెడ్డెప్ప వద్దు, నారాయణస్వామి కావాలి

జీడీనెల్లూరు నియోజకవర్గ వైసీపీ నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 20: జీడీ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెడ్డెప్ప వద్దని, నారాయణస్వామి కావాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల వైసీపీ అధ్యక్షులు, పార్టీ నేతలు వేర్వేరుగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వైసీపీ అధిష్ఠానం నాల్గవ విడతగా విడుదల చేసిన ఎమ్మెల్యే, ఎంపీల జాబితాలో ప్రస్తుత జీడీ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం నారాయణ స్వామిని చిత్తూరు ఎంపీగా.. చిత్తూరు ఎంపీ రెడ్డెప్పను జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని వైసీపీ నేతలు నారాయణ స్వామికే తిరిగి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నారాయణ స్వామికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోతే తమ పదవులకు రాజీనామా చేస్తామని అల్టిమేటం జారీచేశారు. అలాగే రెడ్డెప్పకు తాము సహకరించబోమని తేల్చి చెప్పారు.

గీజర్ పేలి వృద్ధురాలి మృతి

చిత్తూరు, జనవరి 20: ప్రమాదవశాత్తూ గీజర్ పేలడంతో ఓ వృద్ధురాలు మృతి చెందారు. చిత్తూరు నగరంలోని సాంబయ్యకండ్రిగలో ప్రేమలత(73) శనివారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో గీజర్ ఆన్‌చేయగా, అది ప్రమాదవశాత్తూ పేలిపోయింది. ఈ ఘటనలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడగా, సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఒకటో పట్టణ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు.

బోగస్ ఓట్ల పునఃపరిశీలనలో యంత్రాంగం బిజీబిజీ

తిరుపతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):తిరుపతి దొంగ ఓట్ల కుంభకోణంపై ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యలతో అధికారులు అప్రమత్తమయ్యారు.ఫైనల్ ఓటరు జాబితాను తప్పుల్లేకుండా చూసే పనిలో పడ్డారు. తిరుపతి అసెంబ్లీకి ఈఆర్వోగా ఉన్న మున్సిపల్ కమిషనర్ హరిత సిబ్బందితో సమీక్షలు నిర్వహిస్తున్నారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకూడదని హెచ్చరిస్తున్నారు. బీఎల్వోలు, ఇతర అధికారులతో కలిసి జాబితాను పునఃపరిశీలిస్తున్నారు. తాజాగా గుర్తించిన నకిలీ ఓట్ల జాబితాను ఇవ్వాలని విపక్ష పార్టీ నేతలను అడిగి తెప్పించుకుంటున్నట్టు సమాచారం. చంద్రగిరి నియోజకవర్గ ఈఆర్వోగా ఉన్న ఆర్డీవో నిషాంత్ రెడ్డిపై కూడా ఈసీ కొరడా ప్రభావం కనిపిస్తోంది. రెవెన్యూ సిబ్బందిని కాకుండా ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 10మంది సిబ్బందిని డిప్యుటేషన్‌పై తీసుకున్నారు. ప్రతి మండలానికీ ప్రత్యేకాధికారులను నియమించి ఓటర్ల జాబితా పునఃపరిశీలనలో బిజీబిజీగా కనిపిస్తున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లి ర్యాండమ్‌గా తనిఖీ చేస్తున్నారు.గుర్తించిన నకిలీ ఓట్లను తొలగించే పనిలో పడ్డారు. ఈ క్రమంలో వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి పదిమందిపై కేసులు కూడా నమోదు చేసినట్టు తెలిసింది.

ఆ ఓట్ల జాబితా ఇవ్వండి : టీడీపీ

దొంగ ఓట్ల కుంభకోణంలో ప్రధాన పాత్రను వైసీపీ కార్యాలయాలు పోషించాయని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. తిరుపతి ఉప ఎన్నికకు సంబంధించి నాటి ఎలక్టోరల్ రిటర్నింగ్ ఆఫీసర్(ఈఆర్వో) లాగిన్ నుంచి దాదాపు 34వేల బోగస్ ఎపిక్ కార్డులు ముద్రించారని ఎన్నికల కమిషన్ గుర్తించిన విషయం తెలిసిందే.ఎన్నికల సంఘం గుర్తించిన దొంగ ఓట్ల జాబితా కావాలని టీడీపీ తిరుపతి ఇన్‌చార్జి సుగుణమ్మ శనివారం కలెక్టర్ వెంకట్రమణా రెడ్డిని, కమిషనర్ హరితను కలిసి కోరారు. అయితే ఆ జాబితా తమ వద్దలేదని పోలీసుల విచారణలో ఉందని వారు చెప్పారు.ఈ సందర్భంగా సుగుణమ్మ మీడియాతో మాట్లాడుతూ తిరుపతిలో వైసీపీ నేతల పనులతో అధికారులు బలైపోతున్నారన్నారు. ధర్మయుద్ధం చేయమని తాము పదేపదే చెబుతున్నామని, అయితే వారు దొంగ ఓట్లపైనే ఆధారపడుతున్నారని మండిపడ్డారు. ఫేక్ ఓటరు లేకుండా పునఃపరిశీలన చేసి అసలైన ఓటరు జాబితాతో ఎన్నికల్లోకి రావాలని చెప్పారు. అధికారులు మరింత అప్రమత్తంగా ఉండి చర్యలు చేపట్టాలని కోరారు. టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, బుల్లెట్ రమణ, శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్ యాదవ్, చిన బాబు, మహేష్ యాదవ్, పుష్పావతి, కృష్ణ యాదవ్, కంకణాల రజనీకాంత్, కరాటే చంద్ర, ఆముదాల తులసి తదితరులు ఆమె వెంట వున్నారు.

పలువురు ఎస్ఈబీ ఎస్ఐల బదిలీ

చిత్తూరు సిటీ, జనవరి 20: జిల్లాలో పలువురు ఎస్ఈబీ ఎస్ఐలను బదిలీ చేస్తూ అనంతపురం ఎస్ఈబీ డీసీ శనివారం ఆదేశాలు జారీచేశారు. చిత్తూరు అర్బన్ ఎస్ఐ రామ్‌ప్రసాద్‌ని సత్యసాయి జిల్లా మడకశిరకు బదిలీ చేశారు. అలాగే చిత్తూరు రూరల్‌లోని జి.మోహన్‌బాబును కడప జిల్లాబద్వేలుకు, కార్వేటినగరంలోని కె.భాస్కర్‌ని అనంతపురం జిల్లా డీటీఎఫ్‌కు, బి.జయశంకర్ తిరుపతి జిల్లా చంద్రగిరికి, నగరిలోని పి.భానుప్రకాష్‌ను సత్యసాయి జిల్లా తనకల్లుకు, పలమనేరులోని బి.రామదాసును కడప డీటీఎఫ్‌కు, పుంగనూరులోని జి.అశోక్‌కుమార్‌ని తిరుపతి రూరల్‌కు, పులిచెర్లలోని వి.కామేశ్వరనాయుడిని అన్నమయ్య జిల్లా రాయచోటి డీటీఎఫ్‌కు, వి.కోట చెక్‌పోస్టులోని ఏవీ రమణరాజును తిరుపతి జిల్లా పుత్తూరుకు, ఎన్ఆర్ పేట చెక్‌పోస్టులోని టి.వెంకటరత్నంను అనంతపురం జిల్లా కంబదూరుకు, క్యాటిల్‌ఫారం చెక్‌పోస్టులోని ఎ.విజయ్‌కుమార్‌ని అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంకు, చిత్తూరు డీటీఎఫ్‌లోని మస్తాన్‌వలీని సత్యసాయి జిల్లా మడకశిరకు, చిత్తూరు ఇంటెలిజెన్స్‌లోని పృథ్వీరాజ్‌ను కర్నూలు జిల్లా పంచలింగాలకు, పలమనేరులోని ఎ.రామమూర్తిని కర్నూలు జిల్లా హన్మకొండకు, చిత్తూరు డీటీడబ్ల్యూ ఎస్ఐ కె. బాబును కర్నూలు జిల్లా సుంకేశులకు బదిలీ చేశారు.

పక్క జిల్లాల నుంచి ఇలా..

అనంతపురం ఎస్ఐ కె.పవన్‌కుమార్‌ని చిత్తూరు అర్బన్ స్టేషన్‌కు, అనంతపురం జిల్లా రాయదుర్గంలోని ఎం.హరికృష్ణను పుంగనూరుకు, అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలోని బి.కృష్ణానాయక్‌ని నగరికి, అనంతపురం జిల్లా కంబదూరులోని ఆర్.మునస్వామిని ఎన్.ఆర్.పేట చెక్‌పోస్టుకు, సత్యసాయి జిల్లా ధర్మవరంలోని టి.సుశీలమ్మను వి.కోట చెక్‌పోస్టుకు, నేకేపల్లిలోని కె.నాగరాజును చిత్తూరు రూరల్ స్టేషన్‌కు, కడపలోని సి.భారతిని కార్వేటినగరానికి, కడప జిల్లా బద్వేలు ఎస్ఐ ఎస్.రూపను చిత్తూరు డీటీఎఫ్‌గా బదిలీ చేశారు.

ఆలయ నిర్మాణాన్ని ధ్వంసం చేసిన వైసీసీ నాయకుడు

స్థానికుల ఫిర్యాదుతో సర్దుబాటు చేసిన తహసీల్దారు



కాటంరాజు ఆలయ నిర్మాణాన్ని ధ్వంసం చేస్తున్న వైసీపీ నాయకుడు బాబు

చౌడేపల్లె, జనవరి 20: ఓ ఆలయ నిర్మాణాన్ని స్థానిక వైసీపీ నాయకుడు అడ్డుకుని, ధ్వంసం చేశాడు. స్థానికులు వెంటనే తహసీల్దారుకు ఫిర్యాదు చేయడంతో ఆయన సిబ్బందిని పంపి సర్దుబాటు చేయాల్సి వచ్చింది. ఈ సంఘటన చౌడేపల్లె మండలంలో శనివారం జరిగింది. చౌడేపల్లె పంచాయతీ చిన్నకొండామారి గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ చివరిలో కొన్ని తరాలుగా కాటంరాజు ఆలయం ఉంది. ఆలయం మరమ్మతులకు గురవడంతో ఈనెల 24వ తేదీన పశువుల పండుగ నిర్వహణకు గ్రామస్తులంతా చందాలు వేసుకుని పునఃనిర్మాణం చేపట్టారు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, 13వ వార్డు సభ్యురాలు గుర్రమ్మ భర్త బాబు ఆ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. నిర్మాణంలోని ఆలయ గోడలను సైతం గడ్డపారతో ధ్వంసం చేశారు. ఈ విషయంపై గ్రామస్తులు వెంటనే తహసీల్దార్ మాధవరాజుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన రెవెన్యూ సిబ్బందిని పంపించి బాబుకు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. దాంతో తిరిగి గ్రామస్తులు ఆలయ నిర్మాణ పనులు చేపట్టారు.

జనసేన రాయలసీమ జోన్ కమిటీ నియామకం

చిత్తూరు సిటీ, జనవరి 20: జనసేన రాయలసీమ జోన్ కమిటీని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. అందులో చిత్తూరుకు చెందిన దేవినేని యశ్వంత్, రాకేష్ కో-కన్వీనర్లుగా, రమేష్, పూల ప్రభాకర్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

కర్ణాటక మద్యం విక్రయ ముఠా గుట్టు రట్టు

5వేల టెట్రా ప్యాకెట్ల స్వాధీనం - ఇద్దరి అరెస్టు, మరో ఏడుగురిపై కేసు నమోదు, ఓ వ్యాన్ సీజ్



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుల వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

గంగవరం, జనవరి 20: కర్ణాటక మద్యాన్ని తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. దాదాపు 5వేల (90 ఎంఎల్) టెట్రాప్యాకెట్లు, ఓ వ్యానును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి, మరో ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఆ వివరాలను శనివారం గంగవరం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో పట్టుబడిన మద్యంతోపాటు నిందితుల వివరాలను పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి మీడియాకు తెలిపారు. కొంతకాలంగా కర్ణాటక నుంచి మద్యం కొనుగోలు చేసి గంగవరం మండలంతోపాటు పరిసరప్రాంతాలకు సరఫరా చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలో గంగవరం సీఐ కృష్ణమోహన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డిలతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. పక్కా సమాచారంతో శుక్రవారం రాత్రి పలమనేరు-బెంగళూరు రహదారిలో గంగవరం మండల పరిధిలోని పత్తికొండ బస్టాప్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. పోలీసులను చూసి ఓ వ్యాను వేగంగా వెళ్లిపోతుండటంతో వెంబడించి ఆపారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో అట్టబాక్సులు కనిపించాయి. వాటిని తెరవగా కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు బయటపడ్డాయి. వాహనంలోని గంగవరం మండలం బెస్తగానిపల్లెకు చెందిన కేశవులు, కురపల్లెకు చెందిన గంగాధర్‌లను అదుపులోకి తీసుకున్నారు. విచారించగా, వీరు గంగవరం మండలం కురపల్లె గిరి ఆదేశానుసారం అతడికి చెందిన ఓ వ్యానులో కర్ణాటక రాష్ట్రం నంగిలి బోర్డర్‌లో ఉన్న దీపిక వైన్స్‌లో పనిచేసే క్యాషియర్ శేఖర్ సహకారంతో మద్యం కొనుగోలు చేస్తున్నారు. ఈ మద్యం ప్యాకెట్లను మండలంలోని పసపత్తూరు, మాడి, నిడిగుంట గ్రామాల మీదుగా తీసుకొచ్చి.. కురపల్లెకి చెందిన బాబు, హరి, నాయనిచెరువుకు చెందిన మణి, పత్తికొండకు చెందిన వెంకట్రామయ్య, బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లెకు చెందిన నందకుమార్‌కు అందించేవారు. అందరూ కలిసి ఓ ముఠాగా పరిసర ప్రాంతాల్లో అధిక ధరలకు మద్యాన్ని విక్రయించి, జల్సాలు చేసేవారని డీఎస్పీ తెలిపారు. దాంతో కేశవులు, గంగాధర్‌లను అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి రూ.8లక్షల విలువైన కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లతోపాటు వ్యానును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరుపరచనున్నట్లు చెప్పారు. ఈ మద్యం విక్రయాలతో సంబంధం ఉన్న మిగిలిన ఏడుగురిపైనా కేసు నమోదు చేశామని, త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి అయిన గిరిపై ఇప్పటికే గంగవరం, బైరెడ్డిపల్లె స్టేషన్లలో మూడు, పలమనేరు ఎక్సైజ్ స్టేషన్‌లో ఓ కేసు కలిపి మొత్తం నాలుగు కేసులు, కేశవులుపై బైరెడ్డిపల్లె, గంగవరంలో మూడు కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎన్నిసార్లు పట్టుబడినా తీరు మారకపోవడంతో గిరిపై పీడీయాక్టు కోసంపై అధికారులకు సిఫారసు చేయనున్నట్లు డీఎస్పీ స్పష్టం చేశారు.

యూటీఎఫ్ ఉపాధ్యాయుల నిరసన



పలమనేరు, జనవరి20 : పలమనేరు యూటీఎఫ్ డివిజిన్ కార్యాలయం వద్ద శనివారం యూటీఎఫ్ ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయిలు, డీఏ, సరెండర్‌లీవు, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ తదితర ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని వారు డిమాండు చేశారు. 12వ పీఆర్సీ విధి విధానాలు నిర్ణయించకుండా ప్రభుత్వం కావాలని ఆలస్యం చేస్తోందని వారు ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం పీఆర్సీ విధి విధానాలు నిర్ణయించి పీఆర్సీ నివేదిక వచ్చేలోపు 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు బాబు, కృష్ణమూర్తి, ప్రసన్నకుమార్, డివిజిన్ నాయకులు దయానంద, భాస్కరయ్య, సుబ్రమణ్యం, రామమూర్తి, శ్రీనివాసులు, హరినారాయణ, భానుమూర్తి, అమీర్‌వల్లి, హరిప్రసాద్, శారద తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వరి నాట్లు



సోమల, జనవరి 20 : రబీ సీజన్‌లో వరి సాగు గణనీయంగా పెరుగుతోంది. గత మూడేళ్లగా వరి సాగు చేసిన రైతులు నష్టాలు చవిచూశారు. వరికి గిట్టుబాటు ధర లేక సాగు చేయలేకపోయారు. 75కిలోల బస్తా రూ. 2400కు చేరుకోవడంతో రైతుల్లో ఉత్సాహం చోటు చేసుకుంది. గతంలో 75కిలోల బస్తా రూ. 1500లోపే పలికింది. ఈక్రమంలో 50శాతం వరి సాగు తగ్గిపోయింది. కొందరు రైతులు పశుగ్రాసం కోసమే వరి సాగు చేశారు. సోమల, ఇరికిపెంట, కందూరు, పెద్దఉప్పరపల్లె, చిన్నఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె, నడింపల్లె, తమ్మినాయనపల్లె పంచాయతీల్లో 2 వేల ఎకరాల్లో వరి సాగుకు శ్రీకారం చుట్టారు.

నవోదయ పరీక్షా కేంద్రాల తనిఖీ



పుంగనూరు రూరల్, జనవరి 20: పుంగనూరులో నవోదయ పరీక్షా కేంద్రాలను చిత్తూరు డీఈవో విజయేంద్రరావు తనిఖీ చేశారు. శనివారం పట్టణంలోని కొత్తయిండ్లు ప్రభుత్వ పాఠశాల, జడ్పీ బాలకోన్నత ప్రభుత్వ పాఠశాల, బసవరాజ ప్రభుత్వ పాఠశాలలో నవోదయ పరీక్షా కేంద్రలను పరిశీలించి మౌలిక వసతులపై ఆరా తీశారు. పరీక్షలకు 565మంది హాజరు కావాల్సివుండగా 523మంది మాత్రమే పరీక్షలకు హాజరైనట్లు ఎంఈవో రెడ్డెప్పశెట్టి తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రుద్రాణి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్షలు

పలమనేరు, జనవరి20 : పలమనేరు మండలంలో శనివారం నవోదయ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 6వ తరగతి ప్రవేశం కోసం పట్టణంలోని బాలికోన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. బాలుర పాఠశాలలో 168 మంది హాజరు కావాల్సి వుండగా అందులో 122 మంది హాజరయ్యారు. ఈ పరీక్షా కేంద్రానికి ఛీఫ్‌గా కె. విజయ కుమార్, డిపారుమెంట్ ఆఫీసర్‌గా గణపతి నాయుడు, పరిశీలకులుగా జగదీష్ కుమార్ విధులు నిర్వహించారు. బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్షాకేంద్రంలో 136 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి వుండగా 86 మంది హాజరయ్యారు. ఈపరీక్షా కేంద్రానికి ఛీఫ్‌గా కె. ఈశ్వరప్రసాద్, డిపార్టుమెంట్ ఆఫీసర్‌గా కె.ఎన్. నేతాజి విధులు నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్‌గా పలమనేరు ఎంఈఓ లీలారాణి వ్యవహరించారు.

మహిళలను గౌరవించాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి కార్తీక్

పుంగనూరు, జనవరి20: మహిళలను గౌరవించినప్పుడే సమాజాభివృద్ధి జరుగుతుందని పుంగనూరు న్యాయమూర్తి కార్తీక్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మహిళల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టాలని, మహిళల రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలని, విద్యాహక్కు చట్టం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సివుందన్నారు. సీఐ రాఘవరెడ్డి మాట్లాడుతూ మహిళలు వేధింపులకు లోనైతే వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే వారికి రక్షణ కల్పించి, బాధ్యులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, న్యాయవాదులు ఆనంద్‌కుమార్, వీరమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడి నియామకం



వి.కోట, జనవరి 20: చిత్తూరు పార్లమెంటరీ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడిగా వి.కోట మండలం కొడగళ్ళు గ్రామానికి చెందిన ఆడిటర్ లక్ష్మణ్‌గౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం వి.కోట టీడీపీ కార్యాలయంలో లక్ష్మణ్‌గౌడ్‌ను పార్టీ నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, నాయకులు రాంబాబు, సోము, ధీరజ్, నాగభూషణం, నారాయణస్వామి, శబరీష్, రామూర్తి, రాము, జనార్ధన్‌రెడ్డి, సతీష్, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం-ఆంధ్ర విజేతలకు బహుమతులు



వి.కోట, జనవరి 20: ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల విజేతలకు శనివారం ఎంపీడీవో మహ్మద్‌రఫీ బహుమతులు అందజేశారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం క్రికెట్ ఫైనల్స్ పోటీలు జరిగినట్లు తెలిపారు. విజేతలను ఎమ్మెల్యే వెంకటేగౌడ, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పీ.ఎస్.నాగరాజ్, ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీ తమీంఖాన్ అభినందించారు.

నేడు కుప్పంలో జయహో బీసీ సదస్సు

కుప్పం, జనవరి 20: కుప్పంలోని ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో ఆదివారం జయహో బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తెలిపారు. పార్టీ శ్రేణులు ఉదయం 9.30 గంటలకల్లా స్థానిక పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు.

చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి : చల్లా



దాదేపల్లె దర్గాలో ప్రార్థన చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి, ముస్లిం నేతలు

చౌడేపల్లె, జనవరి20: రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం అని ఆ పార్టీ పుంగనూరు ఇన్‌చార్జి చల్లా రామచంద్రా రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని దాదేపల్లె, బుటకపల్లె, దుర్గసముద్రం, రాజూలూరు, బండమీదపల్లె, క్యాతనపల్లె, చిన్నగానిపల్లె, గాండ్లపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలు పెరిగాయని, అభివృద్ధి మాత్రం శూన్యంగా మారిందన్నారు. మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి ములంగి రమణ, మైనార్టీ మండలాధ్యక్షుడు మహ్మద్ ఘని, నాయకులు లక్ష్మీపతిరాజు, గిరిరాజు, బోయ కొండ సుబ్బు, హరిప్రసాద్, ప్రభాకర్, హమీద్ ఖాన్, వెంగళపల్లె రమణ, రామకృష్ణ, భూషణ, వెంకటరమణ, నాగరాజ రెడ్డి, మునిరాజ, చంద్రబాబు, గణపతి, శివరెడ్డి, కార్తీక్, సహీన్‌షా, సైదేఖాన్, షంషీర్, ఫరీద్‌ఖాన్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కల్లూరు : టీడీపీ మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పుంగనూరు నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఆయన చౌడేపల్లి పర్యటనకు వెళుతూ కల్లూరులో నాయకులు, కార్యకర్తలతో కొంతసేపు మాట్లాడారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు.

సమస్య తీరేదాకా అంగన్వాడీల సమ్మె ఆగదు



పలమనేరులో రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీలు, కుప్పం, బైరెడ్డిపల్లెలలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల నిరసన

కుప్పం, జనవరి 20: తమ సమస్యలు తీరేదాకా సమ్మె ఆపే ప్రశ్నే లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. కుప్పంలో అంగన్వాడీల నిరసన దీక్షలు శనివారం నాటికి 40వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు లలిత మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోగా సీఎం జగన్ దమనకాండకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్ని కష్టాలు ఎదురైనా, ఇంకా ఎన్ని బాధలు పెట్టినా నిరసన ఆపేది లేదని తెగేసి చెప్పారు. ప్రాణాలు పోయినా పోరాటం ఆపేది లేదని, డిమాండ్లను సాధించి తీరుతామని ప్రతిన చేశారు. శనివారంనాటి ధర్నాలో కుప్పం, శాంతిపురం మండలాలకు చెందిన ఐసీడీఎస్ ప్రాజెక్టుల అంగన్వాడీలు పాల్గొన్నారు.

పలమనేరు : పలమనేరులో శనివారం అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు రాస్తారోకో చేపట్టారు. ఐసీడీఎస్ కార్యాలయం నుంచి వారు ర్యాలీగా బయలు దేరి డాక్టర్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు గంగరాజు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో వ్యవహరించవలసిన ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో ఎస్మాతో భయపెట్టాలని చూడటం దురదృష్టకరమన్నారు. ఇకనైనా వెంటనే ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండుచేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గిరిధరగుప్తా, ఓబుల్‌రాజు, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లెలో అంగన్వాడీ కార్యకర్తల నిరసన కొనసాగుతోంది. శనివారం వారు చేస్తున్న సమ్మె 40వ రోజుకు చేరుకుంది. ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంవద్ద అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు.

జయహో బీసీ సభను జయప్రదం చేయండి : గౌనివారి



సమావేశంలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

రామకుప్పం, జనవరి 20: పట్టణ శివార్లలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయ సమీపంలో మంగళవారం జరిగే జయహో బీసీ సభను జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు, కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి మునిరత్నం కోరారు. శనివారం రామకుప్పం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ పాలనలో బీసీల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేశామన్నారు. వైసీపీ పాలనలో బీసీలతోపాటు అట్టడుగు వర్గాల ప్రజలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఈ విషయాలను ప్రజలకు తెలియజేసి, జయహో బీసీ సభకు వేలాదిగా తరలి వచ్చేలా నేతలు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రినారాయణాచారి, బీసీసెల్ జిల్లా కార్యదర్శి మనోహర్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం, పార్టీ మండల ప్రధానకార్యదర్శి నరసింహులు, బీసీసెల్ నియోజకవర్గ ప్రధానకార్యదర్శి వెంకటరమణ, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నేతలు రామ్మూర్తి, నందారెడ్డి, గజేంద్ర, వేలు, పెరుమాళ్, చిన్నసురేష్, కొళ్ళపల్లెబాబు, భానుమూర్తి, మంజునాథ్, నరసింహులు, లోకేష్, గోవిందప్ప, గిరిదాసు, అల్లీశీనా, మోహన్, నాగరాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వి.కోట : జయహో బీసీ కార్యక్రమాన్ని వి.యవంతం చేయాలని మండల బీసీ సెల్ అధ్యక్షుడు డి.వి.కుమార్ కోరారు. ఈనెల 23న వి.కోటలోని జీఎంఎస్ కళ్యాణ మండపంలో జరిగే ఈ సభకు బీసీలు తరలిరావాలని పిలుపు నిచ్చారు. ఈ మేరకు పార్టీ ముద్రించిన కరపత్రాలు గ్రామాల్లో పంచుతూ బీసీ నేతలు పర్యటించారు. కార్యక్రమంలో బీసీ నేతలు నాగభూషణం, ఈశ్వర్, సోము, రామూర్తిఆచారి, రుహుల్లా, శివకుమార్, చౌడప్ప, చిట్టిబాబు, రాము, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అడుగంటిపోయిన వైఎస్సార్ జలాశయం



పలమనేరు సమీపంలో అడుగంటిన వైఎస్సార్ జలాశయం, ట్రాన్స్‌ఫారం వద్ద ఊడిన గేట్లు, మొలచిన పిచ్చిమొక్కలు, సిబ్బంది భవనంలో చెత్తాచెదారం

పలమనేరు, జనవరి 20 : పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన వైఎస్సార్ జలాశయంలో నీరు అడుగంటి పోయింది. దీంతో మరో పదిరోజులకు మాత్రమే ఈ నీరు వచ్చే అవకాశం వుంది. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సిద్ధమవుతున్నారు. పలమనేరు మున్సిపాలిటీలో ప్రస్తుతం 60 వేలకు పైగా జనాభా వుంది. రోజుకు కనీసం 3.75 మెట్రిక్ లీటర్ల నీరు అవసరమవుతుంది. అయితే వైఎస్సార్ జలాశయంలో నీరు పుష్కలంగా వున్న రోజుల్లో దాదాపు 3 ఎంఎల్‌టీల నీటిని పంపింగ్ చేసే వారు. అయితే ఈ ఏడాది వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో కౌండిన్య నదికి నీటి ప్రవాహం రాలేదు. దీంతో కౌండిన్యనదిపై కాలువపల్లి వద్ద నిర్మించిన వైస్సార్ జలాశయంలో నీటి మట్టం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో గత మున్సిపల్ సమావేశంలోనే అధికారులు ముందస్తుగా రానున్న నీటి సమస్య పరిష్కారం కోసం ట్యాంకర్లు ఏర్పాటుకు, అదనపు బోర్లు వేసేందుకు తీర్మానాలు చేయించుకున్నారు. ఏదేమైనా ఫిబ్రవరి మొదటి వారంనుంచి నీటి సమస్య ఎదుర్కోక తప్పదని చెప్పవచ్చు.

అస్తవ్యస్తంగా వైఎస్సార్ జలాశయం నిర్వహణ

వైఎస్సార్ జలాశయం నిర్వహణ పట్ల అధికారుల అశ్రద్ధ స్పష్టంగా కనిపిస్తోంది. అడుగంటి పోయినప్పటికి నీటిని అలాగే తోడి వాటిని ఫిల్టర్ చేసి నీటిని నేటికి సరఫరా చేస్తున్నారు. అంతేకాక అక్కడ పంపింగ్‌కోసం ఏర్పాటుచేసిన ప్రధాన పైప్‌లైన్ చుట్టూ మురుగునీరు, పాచిపట్టి నిల్వవుంటోంది. అక్కడి లీకేజి గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. అంతేకాక ట్రాన్స్‌ఫారం చుట్టూ ఏర్పాటుచేసిన కంచె, గేట్లు విరిగి పోయి పిచ్చిమొక్కలు మొలిచినా పట్టించుకొనే నాథుడే లేరు. సిబ్బంది వేచి వుండే భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

రామకుప్పం, జనవరి 20: మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధ్యమవుతుందని ఉద్యానశాఖ జిల్లా అధికారి మధుసూదన్ తెలిపారు. శనివారం రామకుప్పంలో నిర్వహించిన మామిడి రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ మామిడి కోతల అనంతరం కొమ్మలు కత్తిరించి, గాలి, వెలుతురు బాగా ఉండేలా చూడాలన్నారు. పూత మొదలవడానికి ముందు 13.0.45(మల్టీకే) 8గ్రాములు, బోరాన్ 2మిల్లీ గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పురుగు మందులు ఒకే రకం వాడకుండా తరచూ మార్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ నితిన్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ విజలాపురంబాబు, మాజీ సర్పంచు సీతాపతి, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు 9మంది ఎంపిక

చౌడేపల్లె, జనవరి 20: మండలానికి చెందిన 9మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ఎంఈవో కేశవ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ చౌడేపల్లె హైస్కూల్ నుంచి నందిని బాయ్, రూపశ్రీ, నాగలక్ష్మి, లక్ష్మీ, పుదిపట్ల హైస్కూల్‌కు చెందిన మధురిమ, నందిని, లక్ష్మారెడ్డి, జాహ్నవి, యువతేజలు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి 5ఏళ్ళపాటు రూ.12వేలు స్కాలర్‌షిప్ వర్తిస్తుందన్నారు.

పాఠశాల రోజులు మరువలేనివి : జడ్పీ చైర్మన్



ప్రసంగిస్తున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట, జనవరి 20: చిన్నతనంలో పాఠశాలలో గడిపిన రోజులు మరువలేనివని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలోని దివ్య జ్ఞాన పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. పాఠశాల రోజులను అందరూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపి మంచి జ్ఞాన సముపార్జన చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి సినీనటుడు కోటా శంకర్రావు హాజరై విలువైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య, నాట్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రఘుపతి, సలీం, నారాయణస్వామి, సీఐ లింగప్ప, తహసీల్దార్ చిట్టిబాబు, ఎంఈవో చంద్రశేఖర్, ఎస్ఐ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురవుతున్న శంకర్రాయలపేట చెరువు కట్ట



పెద్దపంజాణి, జనవరి 20: మండలంలోని శంకర్రాయలపేట చెరువు కట్ట కోతకు గురవుతోంది. పుంగనూరు-బైరెడ్డిపల్లె రహదారిలో భాగంగా ఈ చెరువు కట్టకు మట్టి తోలి వెడల్పు చేశారు. అయితే చెరువు కట్టకు కొద్దివరకు మాత్రం రాయితో రివిట్‌మెంట్ కట్టి వదిలేశారు. దీంతో తేలికపాటి వర్షానికే కట్ట కోతకు గురవుతోంది. అధికారులు, పాలకులు స్పందించి వర్షాకాలం మొదలయ్యేలోపు చెరువుకట్టకు రివిట్మెంట్ పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉద్యోగాలకు 116 మంది ఎంపిక

కుప్పం, జనవరి 20: కుప్పంలోని ఐఆర్‌ఎం కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైంది. ఆల్‌ట్రస్ట్ టెక్నాలజీస్, అపెక్స్, బ్లూ ఓషన్, ముత్తూట్ ఫైనాన్స్ గ్రూప్, క్వెస్ గ్రూప్, ఎయిర్‌టెల్ అండ్ ఛానల్ ప్లే, రాండ్ స్టాడ్, ఇన్నోవ్ కంపనీల ప్రతినిధులు ఈ మేళాకు హాజరై ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సీసీఐ డైరెక్టర్ అయ్యలరెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో, కళాశాల చైర్మన్ బీఎం.దయానిధి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు మొత్తం 140 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 116 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు దయానిధి తెలిపారు.

సోమల ఏఎంసీ వద్ద భూ సర్వే

సోమల, జనవరి 20: సోమల-కందూరు మార్గంలోని ఏఎంసీ మార్కెట్ యార్డు వద్ద అధికారులు భూసర్వే చేపట్టారు. శనివారం మండల సర్వేయర్ బాషా ఆధ్వర్యంలో ప్రభుత్వ నిధులతో రైతుల నుంచి కొనుగోలు చేసిన భూమి వివరాలు, రైతుల భూముల రికార్డులను పరిశీలించి సరిహద్దు కొలతలు తీశారు. ఏఎంసీ మార్కెట్‌కు స్థల సేకరణ, యార్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 4కోట్లు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలోనే ఐదుగురు రైతుల నుంచి ఎకరా రూ. 10 లక్షల వంతున 10 ఎకరాలు, అలాగే డీకేటీ భూములను స్వాధీనం చేసుకుని యార్డు నిర్మాణ పనులు చేపట్టారు. పనులు వేగవంతంగా సాగడంతో ప్రత్యేక సర్వే ముమ్మరం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అరుణ నాగేశ్వరరావు, రవీంద్రారెడ్డి, వీఆర్వో రెడ్డెప్ప, కేసీ.చెన్నకేశవులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహాల ఊరేగింపు



బైరెడ్డిపల్లె,జనవరి20: మండలంలోని రామసముద్రంలో నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి ఆలయ కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. నూతన విగ్రహాలను ప్రత్యేకరథంలో రామసముద్రం పరిసర గ్రామాల్లో ఊరేగించారు. ఆలయం వద్ద వేదపండితులు భాస్కర్‌శర్మ శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గజేంద్ర, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ధ్యానాభిరామస్వామి ఆలయ ముస్తాబు



బైరెడ్డిపల్లె,జనవరి20: అయోధ్యలో ఈనెల 22వ తేది రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా కార్వేటికొండ ధ్యానాభిరామస్వామి ఆలయంలో అదే రోజు ప్రత్యేకపూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకుగాను ఆలయ గోపురాలపై జైశ్రీరామ్ కాషాయజెండాలు, తోరణాలతో ముస్తాబు చేస్తున్నారు. స్వామికి అభిషేకం, విశేష పూజలు, భజనలు, అన్నదాన కార్యక్రమాలు వుంటాయన్నారు.

పలమనేరులో కాషాయం రెపరెపలు



పలమనేరు, జనవరి20 : అయోధ్యలో ఈనెల 22వ తేది బాలరాముడి విగ్రహప్రతిష్ఠ సందర్భంగా పలమనేరులో శ్రీరాం నినాదాలతో శ్రీరాముడి చిత్రాలతో ఉన్న జెండాలు వీధుల్లో, ఇళ్లపైన రెపరెపలాడుతున్నాయి. పట్టణంలోని ఆలయాలు సైతం జైశ్రీరాం జెండాలతో నిండిపోతున్నాయి. బీజేపీ, విశ్వహిందూ పరిషత్, శ్రీరామ భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నేడు బ్రాహ్మణ సంఘ సమావేశం

పుంగనూరు రూరల్, జనవరి20: పుంగనూరు నియోజకవర్గ బ్రాహ్మణ కుటుంబ సభ్యుల సమావేశం ఆదివారం ఉదయం 9గంటలకు నిర్వహిస్తున్నట్లు గాయిత్రి మాతా తాలూకా బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడు సురేంద్ర బాబు తెలిపారు. శనివారం స్థానిక హైస్కూల్‌వీధిలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో సంఘనాయకులు రామమూర్తి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాల పరిశీలన

పుంగనూరు రూరల్, జనవరి20: పేదల ఇళ్ల నిర్మాణానికి కేటాయించిన స్థలాలను పరిశీలించినట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ సీతారామ్ తెలిపారు. శనివారం గూడూరుపల్లె సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి పేదల ఇళ్ల నిర్మాణాలకు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, మంత్రి పీఏ చంద్రహాస్, మున్సిపల్ డీఈ మహేశ్ పాల్గొన్నారు.

గాయపడిన వలంటీర్ మృతి

పుంగనూరు రూరల్, జనవరి20: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గ్రామ వలంటీర్ శివకుమార్ తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ రెడ్డెప్ప తెలిపారు. ఈనెల 14వ తేదీన ప్రసన్నయ్యగారిపల్లెకు చెందిన కదిరప్ప కుమారుడు వలంటీర్ శివకుమార్(24) ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళుతుండగా టెంపో వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తిరుపతి స్విమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన తెలిపారు.

ఓం శక్తి ఆలయంలో విశేష పూజలు



కల్లూరు, జనవరి 20: కల్లూరు పట్టణం దాసరిగూడెంలోని ఓం శక్తి ఆలయంలో శనివారం అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి అర్చనలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఓంశక్తి భక్తులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అన్నదానానికి రూ.3 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న భవానీప్రియ, జ్ఞానశేఖర్



విరాళం అందిస్తున్న విజయగౌరి

ఐరాల(కాణిపాకం), జనవరి 20: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి శనివారం రూ.3 లక్షలు విరాళంగా అందింది. ఇందులో కుప్పంకు చెందిన భవానీప్రియ రూ.1,00,116 చెక్కును, చెన్నైకి చెందిన జ్ఞానశేఖర్ రూ.1,00,116, తిరుపతికి చెందిన విజయగౌరి రూ.1,00,016ను విరాళంగా అందించారు. విరాళదాతలను సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్, యువజన కమిటీల ఏర్పాటుకు చర్యలు

- జిల్లా రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్ రమేష్‌బాబు



ప్యాట్రన్ సభ్యులను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు

చిత్తూరు కల్చరల్, జనవరి 20: జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో జూనియర్, యువజన రెడ్‌క్రాస్ కమిటీల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్ వి. రమేష్‌బాబు అన్నారు. శనివారం స్థానిక పలమనేరు రోడ్డులోని రెడ్‌క్రాస్ భవనంలో జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం రెడ్‌క్రాస్ ప్యాట్రన్ మెంబర్లుగా బాలాజి హేచరీస్ ఎండీ డి. ప్రణీత్ కుమార్, కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ అధ్యక్షులు ఎం.వి. శ్రీధర్‌రెడ్డిలను సభ్యులు ఎన్నుకుని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ కట్టమంచి గోవర్ధన్(బాబ్జి), సభ్యులు రెడ్డెప్ప, మురుగేషన్, యం.ఆర్. అరుణకుమారి, కృష్ణమూర్తిరెడ్డి, పాపిరెడ్డి, నంబికరాజ్, జిల్లా గౌరవ కార్యదర్శి సహదేవ నాయుడు, గోపి, చిరంజీవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేయ దూడల పెంపకంతో అదనపు ఆదాయం: జేడీ

తవణంపల్లె, జనవరి 20: సంకర జాతి జెర్సీ పేయ దూడల పెంపకంతో అదనపు ఆదాయం పొందవచ్చునని జేడీ ప్రభాకర్ తెలిపారు. శనివారం మండలంలోని వెంగంపల్లెలో పశుగణాభిసంస్థ, గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో జెర్సీ పేయ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జేడీ మాట్లాడుతూ పేయ దూడలకు మంచి పోషణ అందించాలని, సకాలంలో నట్టల నివారణ, బ్రూసెల్లా, గాలి కుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్లు వేయించాలని సూచించారు. అలాగే రైతులు పాడి పశువులకు రూ.384, గొర్రెలకు రూ.36 చెల్లించి సంవత్సర కాలానికి బీమా పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీలు ఆరీఫ్, వాసు, అసిస్టెంట్ డైరెక్టరు పద్మావతి, గాజులపల్లె పశువైద్యాధికారి పల్లవి, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే శక్తి జగన్‌కి ఉందా?

● చిత్తూరు పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీటర్

గుడిపాల, జనవరి 20: సీఎం జగన్‌కు అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే శక్తి ఉందా అని చిత్తూరు పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీటర్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని ప్రేమించిన మహనీయుడు డాక్టర్ అంబేడ్కర్ అని, ఆయన అందించిన రాజ్యాంగాన్ని చెత్తకుప్పలో పడేసిన పాలకుడు జగన్ అని విమర్శించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు, అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయడం బాధాకరమన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.27 వేల కోట్లు దారి మళ్లించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.

బాబు పాలనతోనే రాష్ట్రానికి భవిష్యత్తు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నింద్ర, జనవరి 20: టీడీపీ అధినేత చంద్రబాబు పాలనతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు వస్తుందని ఆ పార్టీ మండల రైతు విభాగ అధ్యక్షులు గాలి రమేష్ నాయుడు అన్నారు. శనివారం మండలంలోని అత్తూరు పంచాయతీ గుర్రప్పనాయుడు కండ్రిగలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి,మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. రాంబాబు నాయుడు, విజయకుమార్, సుదర్శనం నాయుడు, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

కోసలనగరంలో...

విజయపురం: మండలంలోని కోసలనగరంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు కొండూరు దామోదర్‌రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతగుంటలో....



కరపత్రమిస్తున్న టీడీపీ నేతలు

వెదురుకుప్పం: టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు చంద్రబాబురెడ్డి తెలిపారు. మండలంలోని పాతగుంటలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించారు. నాయకులు తిమ్మరాజులు, దేవేంద్రరెడ్డి మునిజ్యోతి పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

పాలసముద్రం, జనవరి 20: మండలంలోని ఆముదాలపుత్తూరు, బాలక్రిష్ణాపురం, బాలక్రిష్ణాపురం కాలనీ గ్రామాల్లో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుధాకర్ నాయుడు, సుబ్బా నాయుడు, అరుళ్‌నాధన్, నవీన్, ఏయుమలై, మహిళలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్షలు

బంగారుపాళ్యం, జనవరి 20: మండల కేంద్రమైన బంగారుపాళ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నవోదయ ప్రవేశ పరీక్షలను శనివారం నిర్వహించారు. ఈ పరీక్షలకు 245 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 202 మంది హాజరయ్యారని, 43 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో నాగేశ్వరరావు తెలిపారు. డీఈవో విజయేంద్రరావు పాఠశాలను సందర్శించి, పరీక్షలు జరిగే తీరును పరిశీలించారు. కార్యక్రమంలో నవోదయ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ చెంగల్‌రెడ్డి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ సలీం బాషా తదితరులు పాల్గొన్నారు.



జగన్‌కు అంగన్వాడీలు తగిన బుద్ధి చెబుతారు

కార్మిక సంఘాల నాయకుల హెచ్చరిక



నిరసన తెలుపుతున్న కార్మిక సంఘుల నేతలు, కార్వేటినగరంలో జాతీయ రహదారిపై బైఠాయించిన అంగన్వాడీలు

చిత్తూరు రూరల్, జనవరి 20: రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి అంగన్వాడీలు తగిన బుద్ధి చెబుతారని కార్మిక సంఘాల నాయకులు విమర్శించారు. చిత్తూరులో అంగన్వాడీలు 40 రోజులుగా చేస్తున్న సమ్మెకు శనివారం ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాలు సంఘీభావంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం రాత్రిపగలు తేడాలేకుండా సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు సురేంద్రనాథ్, రఘు, కృష్ణ, డేవిడ్, జయశంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై అంగన్వాడీల ధర్నా

కార్వేటినగరం, జనవరి 20: సమ్మెలో భాగంగా కార్వేటినగరం గాండ్ల మిట్ట కూడలి వద్ద శనివారం పుత్తూరు-చిత్తూరు జాతీయ రహదారిపై కూర్చుని అంగన్వాడీలు నిరసన తెలిపారు. తమ సమస్యలను తీర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తుందని అంగన్వాడీలు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల చెందిన అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి గడప గడపకు టీడీపీ 'రా... కదలిరా'

● టీడీపీ, జనసేన సమన్వయంగా ప్రచారం: దొరబాబు



సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

చిత్తూరు సిటీ, జనవరి 20: టీడీపీ - జనసేన సంయుక్తంగా 'రా.. కదలిరా' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు చెప్పారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో టీడీపీ, జనసేన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న చంద్రప్రకాష్, గురజాల జగన్మోహన్, కటారి హేమలత, కాజూరు బాలాజి, సీఆర్ రాజన్, డీకే శ్రీనివాస్‌లు ఉమ్మడిగా కార్యక్రమంలో పాల్గొంటున్నారని చెప్పారు. ప్రచార కార్యక్రమంలో ఎవరూ తమ సొంత బ్యానర్లు, కరపత్రాలు వంటివి ఏర్పాటు చేసుకోకూడదని, అభ్యర్థులు తమ సొంత ప్రచారాన్ని నిర్వహించరాదని సూచించారు. టీడీపీ, జనసేన, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ స్లోగన్లు మాత్రమే చెప్పాలన్నారు. ఎలాంటి విభేదాలు లేకుండా రెండు పార్టీల నేతలు, కార్యకర్తలు సమన్వయంతో ప్రచార కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన చెప్పారు. కార్యక్రమం సుమారు 40 రోజుల పాటు కొనసాగుతుందని అన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు స్థానిక దొడ్డిపల్లెలోని కన్నికలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని దొరబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసీపీ అరాచకపాలనను అంతమొందించి, సుపరిపాలన కోసం 2024 ఎన్నికల్లో టీడీపీ, జనసేన అధికారమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని కోరారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా ఇరు పార్టీల శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ ప్రధానకార్యదర్శి కోదండయాదవ్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి సురేంద్రకుమార్, నేతలు గురజాల చెన్నకేశవులు నాయుడు, మోహన్‌రాజ్, సీఎం విజయ, వెంకటేష్ యాదవ్, హేమాద్రి నాయుడు, వరుణ్‌కుమార్, కాజూరు రాజేష్, త్యాగరాజన్, సయ్యద్ ఫిరోజ్, నౌషాద్, దుర్గాచౌదరి, రాజశేఖర్, అశోకన్, వరలక్ష్మి, జనసేన నేతలు చైతన్య, ఆరణి కవిత, యశ్వంత్, ఏకే శరవణ, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

రబ్బరు స్టాంపు ఎమ్మెల్యే మనకు అవసరం లేదు

● గంగాధరనెల్లూరు టీడీపీ ఇన్‌చార్జి థామస్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ థామస్

శ్రీరంగరాజపురం, జనవరి 20: రబ్బరు స్టాంపు లాంటి ఎమ్మెల్యే మనకు అవసరం లేదని, మంచి నాయకుడిని ఎన్నుకోవాలని గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం జయహో టీడీపీ బీసీ కార్యక్రమంలో భాగంగా మండల బీసీ సంఘం అధ్యక్షుడు దొడ్డ హేమాద్రి యాదవ్, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి శ్రీధర్ యాదవ్ అధ్యక్షతన ఆటోలు, ద్విచక్ర వాహనాలతో థామస్ కారుపై నిల్చొని విక్టరీ చూపిస్తూ మండలంలోని నెళవాయి నుంచి పుల్లూరు క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. థామస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో దొంగలను తయారు చేసిన ఘనత డిప్యూటీ సీఎం నారాయణస్వామిదేనని విమర్శించారు. తనను ఎమ్మెగా గెలిపిస్తే, బీసీల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు, నేతలు బోడపాటి లోకనాథం నాయుడు, సీఆర్ రాజన్, కోదండ యాదవ్, వెంకటేష్ యాదవ్, రాజశేఖర్ నాయుడు, కిషన్‌చంద్, కుమార్, నిరంజన్‌రెడ్డి, బాలాజీ నాయుడు, సిద్దయ్యశెట్టి, రామకృష్ణ, గుండయ్య, ఆరు మండలాల అధ్యక్షులు, బూత్ కన్వీనర్‌లు, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామికే ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలి

పాలసముద్రం, జనవరి 20: డిప్యూటీ సీఎం నారాయణస్వామికే ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలని, ఎంపీ టిక్కెట్ వద్దంటూ పాలసముద్రంలో మండల వైసీపీ నాయకులు శనివారం సమావేశమై డిమాండ్ చేశారు. ఈమేరకు నినాదాలు చేశారు. వైసీపీ మండల కన్వీనర్ తులసీరామ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అన్బు, ఎంపీటీసీ గోవిందరాజులు, సర్పంచ్‌లు బుజ్జినాయుడు, అయ్యప్పన్, త్యాగరాజ్, నాయకులు రవి రెడ్డి, వెంకటేశులు మండడి పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం వర్గీయుల నిరసన గళం

శ్రీరంగరాజపురం: డిప్యూటీ సీఎం నారాయణస్వామిని జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిగానే ప్రకటించాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ సమీపంలో మీడియాతో మాట్లాడుతూ నారాయణస్వామికి ఎమ్మెల్యే టికెట్ ప్రకటించపోతే తాము పదవులకు, పార్టీ సభ్యత్వాలకు రాజీనామా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుప్పయ్య, విజయబాబు, డిల్లెయ్య, మణి, బాబు, మహేష్, లోకయ్య, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామికి టిక్కెట్ ఇవ్వకుంటే రాజీనామా

తిరుపతి(తిలక్‌రోడ్): డిప్యూటీ సీఎం నారాయణస్వామికి జీడీనెల్లూరు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వకుంటే తమ పదవులకు రాజీనామా చేస్తామని వెదురుకుప్పం ప్రజాప్రతినిధులు పార్టీ అధిష్ఠానాన్ని హెచ్చరించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వైసీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ సుకుమార్, ఎంపీటీసీ మురళిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడని చిత్తూరు ఎంపీ రెడ్డెప్పకు జీడీనెల్లూరు ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించడం సరికాదన్నారు. పెత్తందారుల మాట వినకుండా పేదలకు సేవ చేసినందుకే నారాయణస్వామికి అన్యాయం చేస్తున్నారని, అధిష్ఠానం పునరాలోచించాలని అన్నారు. ఈ సమావేశంలో వైసీపీ మాజీ సర్పంచులు బాలకృష్ణయ్య, దొరస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ఎన్‌సీఎల్‌టీ మెంబరు

ఐరాల(కాణిపాకం), జనవరి 20: నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ మెంబర్ (ఎన్‌సీఎల్‌టీ) ఎస్వీ భద్రినాథ్ శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. అలాగే స్వామిని విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ చైర్మన్ రాంబాబు, ద్వారకా తిరుమల ఆలయ ఈవో త్రినాథరావు దర్శించుకున్నారు. వారిని ఏఈవో హరిమాధవరెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రమేష్, బాబు పాల్గొన్నారు.

పెరటి కోళ్లను సద్వినియోగం చేసుకోవాలి

వెదురుకుప్పం, జనవరి 20: పెరటి కోళ్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్, ఏపీఎం కవిత, జడ్పీటీసీ చలంపాళ్యం సుకుమార్ తెలిపారు. శనివారం వెదురుకుప్పం వెలుగు కార్యాలయం వద్ద పెరటి కోళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ క్రమంలో 40 యూనిట్లను అందచేశారు.

ఆడుదాం ఆంధ్ర విజేతలకు బహుమతులు

పాలసముద్రం, జనవరి 20: ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల విజేతలకు శనివారం ఎంపీడీవో రామనాథ రెడ్డి, తహసీల్దార్ బాబు బహుమతులు అందజేశారు. 114 మంది ఆటగాళ్లు వివిధ క్రీడల్లో బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏవో విద్యావతి, ఈవోపీఆర్డీ రమేష్, ఎంఈవో రాజేంద్ర ప్రసాద్, ఏపీవో మార్గరెట్, ఏపీఎం ఫరీద్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన బహుమతులతో క్రీడాకారులు

భవిష్యత్తుకు గ్యారెంటీ వంద శాతం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ

నగరి, జనవరి 20: నగరి మండల పరిధిలో బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ పేర్కొన్నారు. నగరి టీడీపీ కార్యాలయంలో శనివారం నగరి మండల బీఎల్‌ఏల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నగరి మండల టీడీపీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, కార్యదర్శి పురుషోత్తం నాయుడు, నగరి తెలుగు యువత అధ్యక్షుడు చిట్టిబాబు, గోవిందస్వామి, చిత్తూరు బాబు నాయుడు, నారాయణస్వామి నాయుడు, జవహర్‌రెడ్డి, ధనంజయలురాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తికి 'అమ్మఒడి' అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న అమ్మఒడి బృందం

చిత్తూరు రూరల్, జనవరి 20: బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని తుంబుగానిపల్లి హైవే రోడ్డులో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి ఆచూకీ కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో మృతదేహాన్ని ఉంచారు. అయితే మృతుడి ఆచూకీ తెలియకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించాలని పోలీసులు అమ్మఒడి నిర్వాహకులకు సమాచారం అందించారు. శనివారం అమ్మఒడి బృందం గుర్తు తెలియని మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. అమ్మఒడి నిర్వాహకుడు పద్మనాభ నాయుడు, మధుబాబు, ధనమ్మ, ప్రభాకర్, చండిప్రభ, గణేష్, హుస్సేన్, లక్ష్మి, లలిత, పోలీసులు మల్లప్ప నాయుడు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం



చిత్తూరు, జనవరి 20: కట్టమంచి-సాంబయ్యకండ్రిగ రోడ్డు మరమ్మతు పనులను విజయానందరెడ్డి సొంత నిధులతో శనివారం వైసీపీ నేతలు పూజలు చేసి మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో కుమారస్వామిరెడ్డి, కేపీ శ్రీధర్, డాక్టర్ మురళీ, మురళీధర్‌రెడ్డి, చంద్రా నాయుడు, సాయి కిరణ్, సరళ పాల్గొన్నారు.

ఆలయాల్లో స్వచ్ఛతీర్థ కార్యక్రమం

చిత్తూరు కల్చరల్, జనవరి 20: అయోధ్యలో రామమందిరం ప్రారంభం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఆలయాల్లో స్వచ్ఛతీర్థ కార్యక్రమం చేపట్టాలని ఇచ్చిన పిలుపు మేరకు నగరంలో శనివారం ఆలయాలను శుభ్రం చేశారు. స్థానిక వినాయక పురంలోని పోలీస్ టాప్‌లైన్‌లోని సీతారామాంజనేయ ఆలయంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుభ్రంగా ఊడ్చి నీటితో కడిగారు. గిరింపేట దుర్గాంబాలయం, కోదండరామాలయం, వెంకటేశ్వర, అగస్థేశ్వర, రాజుగుడి తదితర ఆలయాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు స్వచ్ఛతీర్థ కార్యక్రమం చేపట్టారు. బీజేపీ భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కన్వీనర్ షణ్ముగం, ప్రధాన కార్యదర్శి యు. శ్రీనివాసులు, మండల కార్యదర్శి రవికుమార్, నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో కమిషనర్ తనిఖీ

చిత్తూరు, జనవరి 20: సార్వత్రిక ఎన్నికలు -2024 దృష్ట్యా నగరపాలక పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు సౌకర్యాలు కల్పించే పనులను వేగంగా చేయాలని కమిషనర్ అరుణ ఆదేశించారు. శనివారం కమిషనర్ కొంగారెడ్డిపల్లెలోని 25, 26, 45, 47, 50, 52 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఎలక్ట్రికల్, నీటి సరఫరాల, ర్యాంపుల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఎంఈ గోమతి, డీఈ రమణ, ఏఈ రజని, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానం పరిశీలన

పూతలపట్టు, జనవరి 20: ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా పలు మైదానాలను చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా పూతలపట్టు, పోలవరం ఉన్నత పాఠశాలల ఆటస్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీవో గౌరి, సర్వేయర్ గోపి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌లో అన్నదానం

పూతలపట్టు, జనవరి 20: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద గల అన్నాక్యాంటీన్‌లో శనివారం అన్నదాన కార్యక్రమం జరిగింది. వాణిజ్య విభాగ జిల్లా ఉపాధ్యక్షుడు హేమాద్రి నాయుడు, నాయకులు ఏకాంబరం, హరి, సుబ్బరాజులు, రామానుజం, నిత్యానందం, దాము, లోకనాథం నాయుడు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.